లంకెలపాలెంలో అనధికార నిర్మాణం

చోద్యం చూస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

విశాలాంధ్ర - పరవాడ: జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెంలో అనధికార నిర్మాణం జరుగుతోంది. ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఓ ప్రభుత్వ ఉద్యోగి ఈ నిర్మాణం జరిపిస్తున్నారు. పైగా సచివాలయానికి కూత వేటు దూరంలోనే ఈ నిర్మాణం జరగడం విశేషం. ముఖ్యంగా జీవీఎంసీ పరిధిలో ఏ నిర్మాణం చేపట్టాలన్నా పట్టణ ప్రణాళిక విభాగం నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. కానీ ఆ ఉద్యోగి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి మరీ అడ్డదారుల్లో ఈ నిర్మాణం చేపడుతున్నారు. ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులే నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ఆదాయం మెరుగుపరచవలసిన ప్రభుత్వ విభాగాల్లో పని చేసే ఉద్యోగులే ప్రభుత్వ ఆదాయాలకు గండి కొట్టడం కంచె చేను మేసే చందంగా ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు. పైగా సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పట్టించుకోలేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి ఈ అనధికార నిర్మాణంపై దృష్టిసారించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రాష్ట్రంలోని ఆర్బీకేలు దేశానికే ఆదర్శం

- రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తూ ఎరువులు, పురుగుమందులు వినియోగిస్తే వ్యవసా యంలో అధిక రాబడి సాధించవచ్చని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ మిషన్ ఆధ్వర్యంలో వ్యవ సాయ అనుబంధ రంగాల భాగస్వామ్య పక్షాల ముఖాముఖి చర్చలో పాల్గొన్నారు. ఉత్తరాంధ్రాలో పాడి పరిశ్రమ ద్వారా అధిక ఆదాయం వస్తుందని అన్నారు. ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న రుణాలు, రాయితీలపై అవగాహన ఉండాలన్నారు. ధాన్యం సేకరణ పారదర్శకంగా జరగాలని అన్నారు. కలెక్టర్ డా .ఎ.మల్లికార్జున మాట్లాడుతూ రైతుల యొక్క క్షేత్ర స్థాయి సమస్యలు తెలుసుకునేందుకు ఈ వ్యవసాయ మిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. రైతులకు సంబందించిన ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఎవరికైనా అందనట్లైతే సచివాలయంలో తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డి వి ఏ ప్రసాద్ రాజు, డీసీఎంఎస్ చైర్పర్సన్ పి.చిన్న తల్లి, అగ్రికల్చర్ మిషన్ మెంబర్ రామారావు, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ చంద్ర శేఖర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, మత్స్యశాఖ జెడి సుమలత, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ రామకృష్ణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మన్మధరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఎల్ఐపిపై శిక్షణా

విశాలాంధ్ర -యలమంచిలి: పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో 6, 7, 8వ తరగతులకు బోధించే యలమంచిలి, రాంబిల్లి మండలాలలో పనిచేస్తున్న ఆంగ్ల, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకి లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. శనివారం కొత్తపేటలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం, బయోలాజికల్ సైన్స్ సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు నిర్వహించే ఎల్ఐపీ శిక్షణకు హాజరవ్వాలని విద్యాశాఖాధికారులు తెలిపారు. ఈ కార్య క్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి జి.లక్ష్మణరావు, మండల విద్యాశాఖాధికారి విశ్వనాథం, రిసోర్సింగ్ పర్సన్స్ కె.శ్రీరామ్మూర్తి, సూర్యప్రకాష్, ప్రధానోపాధ్యాయులు బి.సాయిబాబా పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో 'ఇదేం కర్మ'

విశాలాంధ్ర - మంచంగిపుట్టు: మండల పరిధిలో గల మారుమూల బరడ పంచాయతీ ఒంద్రుగుల గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.బలరాం ఆధ్వర్యంలో ఇదేంకర్మ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లా డుతూ ఒంద్రుగుల గ్రామంలో సీసీ రోడ్లు లేవని, మౌళిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తామని సీఎం గొప్పలు చెబుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి జగత్ రాయ్, సర్పంచ్ వి.లక్ష్మణ్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ప్రసాద్, టీడీపీ నాయకులు మండే కిషోర్ కుమార్, కె.లైకోన్, ఎం.చిన్నిబాబు, వి.చిన్ని, జి.శివ, కామేశ్వరరావు, పరశురాం, గోపాలరావు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

విశాలాంధ్ర - యలమంచిలి రూరల్: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 8 మందికి యలమంచిలి న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్సై డి.ఈశ్వరరావు తెలిపారు. వీరిలో ముగ్గురికి 1 రోజు జైలు శిక్ష, ఒకరికి ఒకరోజు జైలు శిక్ష, నలుగురికి రూ.10,000 చొప్పున మొత్తం రూ. 40000 జరిమానాగా విధించారన్నారు.

మా కుమారుడు వివాహానికి రండి...
సీఎం జగన్‌కు శోభా హైమావతి ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం వైయస్.జగన్ మోహన్ రెడ్డిని శుక్రవారం ఉదయం విజయనగరం జిల్లా ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి దేవి, జీసీసీ చైర్ పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణితో కలిసి తన కుమారుడు శోభ అన్వేష్ కుమార్ వివాహ మహోత్సవానికి హాజరు కావాలని సీఎం వైయస్.జగన్‌కు వివాహ ఆహ్వానపత్రికను అందజేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిస్థితులపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు సమాచారం.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

విశాలాంధ్ర - మాకవరపాలెం: మండలంలోని తామరం ఉపాధ్యాయ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగునీరు నిలిచి పోతుంది. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లు తోందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో డ్రైనేజీలు పూర్తిగా శిధిలావస్థకు చేరుకోవడంతో మురుగునీరు నిల్వ ఉండి పోతుందని, పలువురు రోగాల బారిన పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు.

ముసురున ముల్లంగి రైతులు

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: మూడు నెలలపాటు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు రాక దీన స్థితిలో ముల్లంగి రైతులు వున్నారు. కొర్రాయి పంచాయతీకి సంబంధించిన ఓ రైతు శుక్రవారం అరకు సంతలో విక్రయానికి సుమారు 52 కావిడిలు ముల్లంగిని తీసుకొచ్చాడు. అయితే గత వారంలోని ముల్లంగి కావిడకు 200 రూపాయలు కొనుగోలు జరిగేది. ఒకేసారి ఈ వారంలో కావిడకు కనీసం 50 రూపాయలు కూడా రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. తమ కష్టాన్ని కూడా గుర్తించకపోవడం అన్యాయమని కన్నీరుమున్నీరవుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతుల ఆత్మగోష ప్రభుత్వాలకు అర్థం కావడం లేదని అన్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

విశాలాంధ్ర-గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి ఆలయంలో పొరుగు సేవల సిబ్బంది ఏఈఓలు అధికారుల ఆదేశాలు మాటలు లెక్క చేయటం లేదు. అధికారులు సంబంధిత విభాగం పొరుగు సేవల సిబ్బందికి భక్తుల అవసరార్థం పనులు చేయమని ఆదేశించినా ఇప్పుడు కుదరదు సార్, మాకు ఖాళీ లేదు సార్ అంటూ విధులు నిర్వహించకుండా కాలయాపన చేస్తూ నెల అయ్యే సరికి జీతం అందకుంటే ప్రైస్ వారికి మాకు సరిగా జీతాలు ఇవ్వటం లేదని ఫిర్యాదు చేస్తున్నట్టు సిబ్బంది, అధికారులు అంటున్నారు. విధుల్లో చేరిన మొదట్లో స్వామివారికి తమ వంతు సేవ చేసుకుంటామని వారి వారి పలుకుబడితో విధుల్లో చేరారు. ఏకు మేకైనట్లు దేవుని సేవ దేవుడెరుగు సొంత పలుకుబడి ఉపయోగించుకుని విధుల్ని మరుస్తున్నారు. అధికారులు చెప్పిన మాట చేయాలి కానీ ఆ పని నేను చేయలేను అంటూ అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉదాహరణకు గడచిన 10 రోజుల క్రితం ఓ ఏఈఓ భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న నిత్యాన్నదానం భవనంలో వృధాగా పడిఉన్న ఐరెన్ కుర్చీలు చిన్న చిన్న మరమ్మతులు, తుప్పును శుభ్రంగా వదిలించి, రంగులు వేసి రాజగోపురం, రూ.300/- క్యూలైన్, ప్రసాదాల కౌంటర్ తదితర ప్రదేశాల్లో వేయాలని పొరుగు సేవల సిబ్బందిని ఆదేశించినా ఆ పని చేయలేదు. మరికొంత మంది పొరుగు సేవల వారు అనధికార దర్శనాలు చేయిస్తున్నారని గుస గుసలు వినిపిస్తున్నాయని భక్తులు, స్థానికులు అంటున్నారు.

ఆధార్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీపీ

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలోని గుమ్మ కోట ఆధార్ కేంద్రాన్ని ఎంపీపీ శెట్టి నీలవేణి పరిశీ లించారు. ఇప్పటి వరకు 130 మందికి ఆధార్ సేవలను చేపట్టినట్లు డిజిటల్ అసిస్టెంట్ నాగమణి ఎంపీపీకి తెలిపారు. 2011 నుంచి 16 లోగా ఆధార్ నమోదు చేసుకున్న వారు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డులను అప్డేట్ చేసుకో వాలని అన్నారు. గుమ్మకోట నుంచి శంకుపర్తి వరకు రహదారి నిర్మాణ పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీకి స్థానికులు వినతి అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పారావు, ఉప సర్పంచ్ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి, పెద మడకలో నున్న సర్వ హిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు, వృద్ధ పింఛనుదారు కుటుంబానికి అంత్యక్రియ ఖర్చుల నిమిత్తం 2000/- నగదు అందజేశారు. ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు వానపల్లి వెంకట రమణ శ్రీదేవి దంపతుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పొన్నగంటి వెంకట రమణ, ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీల గజేంద్రరావు, ప్రధాన సలహాదారు పట్టా రామ అప్పారావు, ప్రతినిధులు పొన్నగంటి కొండలరావు, లక్కరాజు రాము, పొన్నగంటి లక్ష్మీ పాల్గొన్నారు.

సిసి ర్యాంప్‌లు వేసి ప్రమాదాలను అరికట్టండి: సీపీఐ

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం ఏబులం నుండి పెదవలస వరకు మధ్య గల రహదారిలో సీసీ ర్యాంప్‌లు వేసి ప్రమాదాలను అరికట్టాలని సీపీఐ మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని ఏబులం నుండి దేవరాపల్లి మీదుగా పెదవలస పోవు మార్గానికి ఈ మధ్య కాలంలోనే తిరిగి తారు వేయడం జరిగిదన్నారు. కానీ బ్రిడ్జిల దగ్గర గుత్తేదారుడు సిసి ర్యాంపులు వేయకపోవడంతో చాలామంది వాహనదారులు ప్రమాదానికి గురి అవుతున్నారని, ఈ రహదారి పనులు జరుగుతున్నప్పుడు గుత్తేదారుడు నిర్లక్షం కారణంగా పెదవలస సమీపంలో ఒక గిరిజన వాహనదారుడు ప్రమాదానికి గురై మృతి చెందాడని అన్నారు. పంచాయితీ రాజ్ శాఖాధికారులు వెంటనే చర్యలు తీసుకొని సిసి ర్యాంపులు వేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

పంచకర్ల నేతృత్వంలో పార్టీ బలోపేతం

విశాలాంధ్ర - మల్కాపురం: పంచకర్ల రమేష్ నేతృత్వంలో పార్టీ మరింత బలోపేతం అవు తుందని వైసీపీ సీనియర్ నాయకులు రాష్ట్ర అదనపు కార్యదర్శి, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం విశాఖ జిల్లా వైసీపీ అధ్యక్ష పదవికి నూతనంగా ఎం పికైన రమేష్ బాబును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

వివిధ సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్

విశాలాంధ్ర - అనకాపల్లి: రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏ.కే.భాస్కర్ పట్టణంలోని వివిధ సేవా కార్యక్రమాల్లో బిజీబిజీగా గడిపారు. ముందుగా అసిస్టెంట్ గవర్నర్ పవన్ స్వగృహంలో సత్కారం చేశారు. నూకాలమ్మ అమ్మవారిని దర్శంచుకొని అక్కడ నుంచి రోటరీ ఐ హాస్పిటల్‌ని సందర్శించారు. ఏ.ఎం.ఏ.వి. మెటర్నరీ హాస్పిటల్ సందర్శించి అధ్యక్షులు రంగారావు కార్యదర్శి హాస్పిటల్ డాక్టర్‌తో చర్చించి హాస్పిటల్‌కి కావాల్సిన స్కానింగ్, అంబులెన్స్ ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే టౌన్ గర్ల్స్ హైస్కూల్‌లో ఇన్‌ట్రాక్ట్ క్లబ్ ఇనాగరేషన్ చేసి స్కూల్ సైన్స్ ఫెయిర్ సందర్శించి పిల్లలను అభినందించి స్కూలుకు కావలసిన మైక్రోస్కోప్లై , లైబ్రరీ ఫర్నిచర్ రోటరీ తరపున ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు జామెంట్రీ బాక్స్ గ్లోబ్, ఇండియా మ్యాప్, వరల్డ్ మ్యాప్ పంపిణీ చేశారు. డ్రాయింగ్ కాంపిటీషన్ ఎ పిక్స్ పోటీల్లో ఫస్ట్, సెకండ్ ప్రైజులు డాక్టర్ శ్యామ్, డిస్ట్రిక్ గవర్నర్ భాస్కర చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. డాక్టర్ శేష్ కుమార్ ఆధ్వర్యంలో పల్స్ పోలియోకు రెండువేల డాలర్లు, రాజేశ్వరప్రసాద్ టిఆర్ఎస్ ద్వారా 4 వేలు డాలర్లు ఫౌండేషన్‌కి రోటరీ సభ్యుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని గవర్నర్ భాస్కర రామ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ సానా త్రినాధరావు, సెక్రెటరీ పి.రాజేష్ నాయుడు, కడిమిశెట్టి సతీష్, రవిరాం జోహార్, డాక్టర్ గ్రంధి సురేష్ కుమార్, పి.రాజేశ ప్రసాద్ రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండల సమావేశాలకు హాజరయ్యే అధికారులు పూర్తి వివరాలతో రావాలని ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎమ్డీఓ అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో గల 32 పంచాయతీలలో ప్రజలకు అవసరమైన సమస్యలను తక్షణమే పరిష్కరించడం మెరుగైన రహదారులు ఏర్పాటు, ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మండల హెడ్ క్వార్టర్ నుంచి జిల్లా కేంద్రం అనకాపల్లి విశాఖపట్నంలకు రెండు బస్సులు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. లంకవానిపాలెం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, ప్రాథమిక ఆరోగ్య భవన పనులు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు ఆసుపత్రి వెళ్ళే దారిలో రిక్వస్టు స్టాపు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

విశాలాంధ్ర - కశింకోట: రక్తదాన శిబిరాల్లో మీరు ఇచ్చే ప్రతి రక్తపు బొట్టు ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితులకు జీవం పోస్తుందని చెట్టినాడ్ సిమెంట్ పరిశ్రమ యూనిట్ హెడ్ జి.జనార్ధన్‌రావు అన్నారు. గురువారం మండలంలోని తాళ్లపాలెం చెట్టినాడ్ సిమెంట్ పరిశ్రమలో రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదానం శిబిరం నిర్వహించారు. రక్తదానం విషయంలో అపోహలు పడవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ.ఎస్.ఐ అధికారి రఘునాథ్, ఏజీఎం నర్సింహ రాజు, హెచ్.ఆర్ సుబ్బరాజు తదితరులు ఉన్నారు.

దేశ భవిష్యత్తుకు యువత దిశా నిర్దేశకులు కావాలి
ఐటీడీఏ పీఓ రోణంకి గోపాలకృష్ణ

విశాలాంధ్ర - పాడేరు: యువత దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం సెట్విస్ ఆధ్వర్యంలో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లా యువజనోత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పీఓ విద్యార్థుల్లో చైతన్యం నింపే ప్రసంగాన్ని ఇచ్చారు. యువత అంటే ముందుగా గుర్తుకు వచ్చేది స్వామి వివేకానంద అని, వివేకానందుడు చికాగో ప్రసంగం యువతకు ప్రేరణ ఇస్తుందన్నారు. మొబైల్ ఫోన్లు ద్వారా సమయాన్ని వృథా చేసుకోవద్దని, అవసరం ఉంటేనే మొబైల్ ఫోన్లు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రత్నకుమారి, సెట్విస్ సిఇఒ పి.నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఎన్.రసూల్, ఎన్ఎస్ఎస్ పిఒ గౌరీశంకర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని ధాన్యం కొలుగోలు కేంద్రాన్ని శుక్రవారం స్థానిక శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని ఆలోచనతో ఆర్.బి.ఐ కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యంను ప్రభుత్వానికే అమ్ముకోవాలని కోరారు. పంటలు వేసిన వెంటనే ఈ క్రాప్ చేయించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చిన నందిపల్లిలో గడప గడపకూ...

విశాలాంధ్ర -దేవరాపల్లి: మండలంలో చిన నందిపల్లి గ్రామంలో శుక్రవారం గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్య మంత్రి బూడి ముత్యాల నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు.

వైసీపీలో చేరికలు

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం మండలం ధర్మసాగరం గ్రామం నుండి టీడీపీకి చెందిన కుటుంబాలు శుక్రవారం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు గొంప కన్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ రమణ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - జికెవీధి: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం జికెవీధి మండలం సచివాలయం 2 పరిధిలో దేరల, పీకే గూడెం, బడ్డమాను పాకలు, కంపమనుపాకలు, అద్దర వీధి, పూజారి పాకలు, గూడెం కాలనీ, మాలిగూడ, నీలవరం, కొత్తగూడెం, ఎర్రవరం, ఆర్వీనగర్, వెదురుపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి కార్యక్రమాలు చేయడంలో వైసిపి ప్రభుత్వం ముందు వరుసలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జికెవీధి ఎంపీపీ బోయిన కుమారి, వైసీపీ మండలాధ్యక్షులు బొబ్బిలి లక్ష్మణ్, జెడ్పీటీసీ శివరత్నం, వైస్ ఎంపీపీ ఆనంద్, దేవుడు, జికెవీధి సర్పంచ్ సుభద్ర, ఎంపీటీసీ నాగమణి, జికెవీధి మండల యూత్ అధ్యక్షుడు అరుణ్, దావనాపల్లి సర్పంచ్, జికెవీధి సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందేరి రామకృష్ణ, వైసిపి నాయకులు అంజి, రాజేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సింహగిరిపై నృసింహ దీక్షలు

విశాలాంధ్ర - సింహాచలం: సింహగిరిపై నృసింహ దీక్షలు(చందనమాల ధారణ) వీనుల విందుగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం తెల్లవారు జామున వందలాది మంది నృసింహస్వామి భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నరసింహస్వామి దీక్షలు స్వీకరించారు. దేవస్థానం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధాన అర్చకస్వాములు శ్రీనివాసాచార్యులు, వేద పండితులు నృసింహ దీక్షలు స్వీకరించడానికి వచ్చిన భక్తుల సమక్షంలో పంచారాత్ర అగమం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కంకణాలను భక్తులకు కట్టి అనంతరం నృసింహ మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాలధారణ చేసిన భక్తులకు దేవస్థానం తరపున తులసిమాల, స్వామివారి చిత్రపటం, చందన మాలలు వేసుకున్న స్వాములకు సింహగిరీశుని చిత్రపటం, తులసిమాల, మాడ, నియమావళి పుస్తకం, స్వామివారి నిత్యాన్నదానంలో ఉచిత సాపాటు, దేవస్థానం బస్సుల్లో కొండపైకి, క్రిందికి ఉచిత ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు కార్య నిర్వహణాధికారి వి.త్రినాథరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

1/70 చట్టానికి తూట్లు
ఆర్అండ్‌బీ రోడ్డు ఆక్రమించి గిరిజనేతరుడి నిర్మాణం

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలో కేంద్రం పాత వ్యవసాయ శాఖ కార్యాలయం పక్కన ఆర్ అండ్ బి రోడ్డు ఆక్రమించి మరీ ఓ గిరిజనేతరుడు దుకాణాన్ని నిర్మిస్తున్నాడు. 1/70 చట్టానికి తూట్లు పొడిచి ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గిరిజన చట్టాలను ధిక్కరిస్తూ గిరిజనేతరులు విచ్చలవిడిగా పబ్లిక్ స్థలాలను సైతం ఆక్రమించుకుని శాశ్వత గృహ నిర్మాణాలను నిర్మించుకుంటున్నారు. సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో వారు మరింత రెచ్చిపోతూ కట్టడాలు చేసుకుంటున్నారు. గిరిజన ప్రాంతంలో 1/70 భూ బదలాయింపు చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులు ఎటువంటి శాశ్వత గృహాలు, భవనాలు, షాపులు నిర్మించుకోవడానికి హక్కు లేదు. అయితే ఈ నిబంధనలను గాలికి వదిలి రెచ్చిపోయి నిర్మాణాలు చేపడుతున్నారు. తక్షణమే సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

జగనన్న శాశ్వత భూహక్కు సర్వే ఒక భూటకం

విశాలాంధ్ర - వి.మాడుగుల: జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే ఒక భూటకమని మాడుగుల టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ పివిజి కుమార్ విమర్శించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ పథకంపై ప్రజలలో ఎన్నో అపోహలు ఉన్నాయని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి భూదందాలు, దౌర్జన్యాలు, అక్రమాలు, రెవెన్యూ రికార్డులలో ఎన్నో అవకతవకలు చేసి రైతులను అనేక ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రైతు పట్టా పాస్ పుస్తకంపై ముఖ్యమంత్రి ఫోటో ముద్రించడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుప్పాల అప్పలరాజు, మాడుగుల మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఉందూరు దేముడు, గొల్లవిల్లి శ్రీరామ్మూర్తి, కసిరెడ్డి అప్పలనాయుడు, పుప్పాల రమేష్, కోన నాగేశ్వరరావు, పుట్టా సంతోష్, గండి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి వారి దేవస్థానం,
సింహాచలం, విశాఖపట్నం జిల్లా
ఆర్.సి.నెం.: సి3/4020/2020, తేది.24.11.2022
ఫోన్ నెం: 9885054588, 9160969755
తాత్కాలిక బహిరంగ వేలం ప్రకటన

శ్రీ స్వామి వారి దేవస్థానం నందు తేది:28.11.2022 ఉదయం గం.11:00లకు కొండ దిగువ దేవస్థానం కార్యాలయం నందు అనగా (తేది.01.12.2022 నుండి తేది.31.12.2022 వరకు) ఒక నెల రోజులకు ఈ క్రింది తెలిపిన వివిధ లైసెన్స్ హక్కునకు తాత్కాలిక బహిరంగ వేలం నిర్వహించబడను.
1)కొండ దిగువ భైరవవాక వద్ద పూజా సామగ్రి విక్రయించుకొనుటకు 2)సన్నిధి ఫలాలు 3)కొబ్బరి కాయలు మరియు పూజా సామగ్రి విక్రయించుకొనుటకు 4)వివాహ శుభకార్యాలకు అవసరమగు సప్లయర్స్ మరియు లైటింగ్ ఏర్పాటు చేసుకొనుటకు 5)సెల్‌ఫోన్స్ మరియు కెమెరాలను భద్రపరచుకొనుటకు 6)సామాన్లు (క్లోక్ రూమ్) భద్రపరచుకొనుటకు 7)తొలిపావంచా వద్ద భక్తులు సమర్పించిన కొబ్బరి ముక్కలను ప్రోగు చేసుకొనుటకు 8)భైరవ స్వామి వారి దేవాలయం నందు ఐస్ క్రీమ్ అమ్ముకొనుటకు 9)గోపాలపట్నం పెట్రోల్‌బంకు వద్ద బుధవారం సంత మినహా మిగిలిన రోజులలో ఆశీలను వసూలు చేసుకొనుటకు 10)గురువారం సంతయందు ఆశీలను వసూలు చేసుకొనుటకు 11)గోపాలపట్నం పెట్రోల్ బంక్ వద్ద బుధవారం సంతయందు ఆశీలను వసూలు చేసుకొనుటకు 12)ఖాళీ నూనె, నెయ్యి మరియు జీడిపప్పు డబ్బాలు ఉన్నది ఉన్నట్లుగా తీసుకొని పోవుటకు 13)పైడితల్లమ్మ, బంగారమ్మ అమ్మవార్ల ఆలయం వద్ద కొబ్బరి ముక్కలు, చీరలు, రవికలు ప్రోగు చేసుకొనుటకు 14)గోవుల గోమయం (పేడ) ఉన్నది ఉన్నట్లుగా తీసుకొనిపోవుటకు తాత్కాలిక హక్కునకు.

సం/- వి.త్రినాథరావు, కార్యనిర్వహణాధికారి

విశాలాంధ్ర

→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

మహిళలకు రక్షణగా చట్టాలు అమలు

ఐటీడీఏ పీఓ రోణంకి గోపాలకృష్ణ

విశాలాంధ్ర - పాడేరు: మహిళల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు చట్టాలను అమలు చేస్తున్నాయని, మహిళలను వేదించడం చట్టరీత్యా నేరమని ఐటిడిఎ పిఒ రోనంకి గోపాలకృష్ణ స్పష్టం చేసారు. శుక్రవారం పాడేరు కాఫీ హౌస్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆద్వర్యంలో మహిళల పట్ల జరుగుతున్న హింస, వేదింపులు నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిదిగా విచ్చేసిన ఐటిడిఎ పిఒ రోనంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ మహిళా చట్టాలపై స్త్రీలకు అవగాహన ఉండాలని, మనకు తెలిసిన వ్యక్తులే అసభ్యంగా ప్రవర్తిసుంటారని, కుటుంబంలో బాలురు, బాలికలు పట్ల పెద్దలు వ్యత్యాసం చూపుతుంటారని, కుటుంబ వ్యవస్థలో మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. సబ్ కలెక్టర్ వి.అభిషేక్ మాట్లాడుతూ భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని, ప్రజాప్రతినిధులు అరకు ఎంపి, పాడేరు ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లు మహిళలు అనే విషయాన్ని గుర్తుంచుకోవలన్నారు. మహిళలను మానసికంగా వేదించినా, అవమానించినా తక్షణమే పిర్యాదు చేసే దైర్యం మహిళల్లో రావాలన్నారు. అనంతరం కాఫీ హౌస్ నుండి అంబేద్కర్ కూడాలి వరకూ ర్యాలీ నిర్వహించి మహిళా చట్టాలను అతిక్రమించే వారిపై ఖటినంగా వ్యవహరించాలని నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పధక సంచాలకులు ఎస్.సూర్యలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జమీల్‌బాషా, ఎడిఎంఅండ్‌హెచ్ఓ లీలాప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, అడ్వకేట్ రాజేశ్వరి, సిడిపిఓలు, కళాశాలల విద్యార్థినిలు తదితర్లు పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక వేధింపులు, నిర్మూలనపై జిల్లా స్థాయి ప్రచారం

జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహిళలు పని చేసే ప్రదేశం లో లైంగిక వేదింపులు (నివారణ- నిషేధం పరిహారం)వేదింపుల చట్టం -2013, పగడ్బందీగా అమలు చేయాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా పరిషత్ కార్యాలయంలో 25 తేదీ నుండి డిసెంబర్ 10 వరకు జిల్లా లో స్పెషల్ కాంపెయిన్‌లో బాగంగా నేడు "మహిళలపై హింస నిర్మూలన కోసం అంతర్జాతీయ దినోత్సవం" కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలక్టర్ డా.ఎ. మల్లికార్జున జెండా ఊపి ద్వారా 15రోజుల కార్యక్రమం ప్రారంభించారు. సుభద్ర మాట్లాడుతూ ఈ కాంపెయిన్ ద్వారా జిల్లాలో మహిళలందరికీ వేదింపుల చట్టం మీద అవగాహన తీసుకురావాలని, ఏ మహిళా కూడా పని చేసే ప్రదేశంలో వేదింపులకు గురికాకుండా చూడాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు జి.సీతారం, దిశ జడ్జి బుల్లి కృష్ణ, మహిళా శిశు సంక్షేమ శాఖ, ప్రాంతీయ చైర్‌పర్సన్ మంతెన మాధవి వర్మ, మహిళా శిశు సంక్షేమ శాఖ , ప్రాంతీయ సంయుక్త సంచాలకులు చిన్మయిదేవి, సహాయ పోలీస్ కమీషనర్ దిశ పోలిస్ స్టేషన్ వివేకానంద, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ రాధ కుమారి, మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి డి.వెంకటేశ్వరి, పథక సంచాలకులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ శోభారాణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల పోరుకు సన్నద్ధం

ఆరు జిల్లాల్లో 297 పోలింగ్ కేంద్రాలు
2 లక్షల 43 వేల 903 మంది ఓటర్లు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఉమ్మడి ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లో పట్టభద్రుల పోరుకు రంగం సిద్ధం అవుతుంది. రాజకీయ పక్షాలన్నీ పట్టభద్రుల ఎన్నిక సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే వైసిపి, టీడిపి, ప్రోగ్రెసివ్ ఫోరం, తమ అభ్యర్థులని ప్రకటించగా బిజెపి నుంచి మళ్ళీ ఎమ్మెల్సీ మాధవి బరిలోకి దిగుతారని ప్రచారం సాగుతుంది. విభజన జిల్లాలు ఆధారంగా మొత్తం ఓటర్లు 2 లక్షల 43 వేల 903 మంది వాటర్ లో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. వీరిలో 1లక్ష 55 వేల మంది పురుషులు కాగా, 88వేల 062 మంది మహిళలు ఉన్నారు. మరో 38 మంది ఇతరులు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ఆరు జిల్లాల్లో 297 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 57 పోలింగ్ కేంద్రాల్లో 46 వేల, 119 మంది ఓటర్లు ఉన్నారు. విజయనగరం జిల్లాలో 64 పోలింగ్ కేంద్రాల్లో 54 వేల 466 మంది ఓటర్లు ఉన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాల్లో 17 వేల 052 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 14 పోలింగ్ కేంద్రాల్లో 10 వేల 200 మంది, అనకాపల్లి జిల్లాలో 44 పోలింగ్ కేంద్రాల్లో 35 వేల 961 మంది, విశాఖపట్నం జిల్లాలో 94 పోలింగ్ కేంద్రాల్లో 80 వేల 105 మంది వాటర్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అత్యధికంగా విశాఖ జిల్లాలోనే పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు ఉన్నారు.

పంచకర్లను కలిసిన వేగి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - పెందుర్తి: వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును ఆ పార్టీ సీనియర్ నాయకులు, పెందుర్తి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ

చైర్మన్ వేగి శ్రీనివాసరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని పంచకర్ల నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఆయన వెంట పెందుర్తి ప్రాంతానికి చెందిన బుట్టా రవికుమార్, శరగడం అప్పారావు, మురళి, కే.వెంకట్రావు, బి. సూరి అప్పారావు, ప్రకాష్ రావు, బి. మదన్, బి. రాజా విశ్వేశ్వరరావు సహా పలువురు వైసిపి నాయకులు ఉన్నారు.

మద్యం సీసాలతో పట్టుబడ్డ వ్యక్తి

విశాలాంధ్ర - యలమంచిలి: పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శుక్రవారం ఉదయం అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న యలమంచిలి మండలం తురంగలపాలెంకి చెందిన వ్యక్తిని పట్టుకుని 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు టౌన్ ఎస్సై కె.పాపినాయుడు తెలిపారు.

జోన్-2లో వాహనాలు వదిలి పరారైన పందుల పెంపకందారులు

విశాలాంధ్ర - మధురవాడ: జీవీఎంసీ శుక్రవారం చేపట్టిన పందుల నిర్మూలనా కార్యక్రమంలో జోన్ -2లో పందులు పెంపకందారులు జెడ్పీతో వివాదానికి దిగారు. పోలీసుల రంగ ప్రవేశంతో తమ వాహనాలు వదిలి పరారయ్యారు. నగర వ్యాప్తంగా ఎనిమిది జోన్లలో పందుల వేటను అధికారులు ముమ్మరం చేశారు. నగర వ్యాప్తంగా 112 పందులను హతమార్చగా జోన్ 2లో 43 పందులను హతమార్చారు. జోన్ 2లో పందుల పెంపకందారులు అడ్డుకోవడమే కాకుండా జోనల్ కమీషనర్ బొడ్డేపల్లి రాముతో వాగ్వివాదానికి దిగడంతో ఆయన పోలీసులకు సమాచారం చేరవేశారు. పెంపకందారులు తమ ద్విచక్ర వాహనాలను విడిచి పారిపోవడంతో అధికారులు 6 బండ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎ.యమ్.హెచ్.ఒ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న పచ్చని పొలాలు

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలోని బూర్జ పంచాయతీ పరిధి మజ్జివలస మార్గంలో పచ్చని పొలాలు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడి రైతులు చేపట్టిన మెట్ల, పల్లం - వ్యవసాయం (టెర్రస్ ఫార్మింగ్) సందర్శకులను ఆకట్టుకుంటోంది. ప్రధాన రహదారికి చేరువలో ఉన్న ఈ వరి పొలాలు కోత దశకు వచ్చి అందంగా కనిపిస్తున్నాయి. ఇటుగా అనంతగిరి మండలం నిమ్మలపాదు, వాలసి, జెండాగరువు, దముకు మీదుగా ఎస్.కోట వెళ్లే పర్యాటకులు ఫోటోలకు ఫోజులిస్తూ ఇక్కడి అందాలను తమ కెమెరాల్లో బంధిస్తున్నారు.

మొక్కలు నాటిన డిఎస్పీ

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం ఆర్టీసి కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్టీసి డిఎం ధీరజ్ ఆధ్వర్యంలో నర్సీపట్నం ఎంఎల్ఎస్ డిగ్రీ కళాశాల, ప్రగతి జూనియర్ కళాశాల సౌజన్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన డిఎస్పీ ప్రవీణ్‌కుమార్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎస్ కళాశాల కరస్పాండెంట్ మీసాల సుబ్బన్న, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి పరామర్శ

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మాజీ మండల అధ్యక్షులు సీనియర్ నాయకులు శోభ వీరభద్ర రాజుని అనంతగిరి ఎంపీపీ నీలవేణి ఆయన స్వగృహంలో శుక్రవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్య కారణంతో తీవ్ర అస్వస్థతకు లోనైన శోభ వీరభద్ర రాజుని బంధువులు భీమవరంలోని తన సొంత ఇంటికి తీసుకొని వచ్చారు. దాంతో శెట్టి నీలవేణి భీమవరం గ్రామానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శోభ వీరభద్ర రాజు సతీమణి రొంపల్లి ప్రాదేశిక సభ్యురాలు శోభ తిరుపతమ్మకు ఈ సందర్భంగా ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో ఎంపీపీతో పాటు గుమ్మకోట సర్పంచ్ పాగి అప్పారావు ఉన్నారు.

మెడికల్ కళాశాల పనులను పరిశీలించిన ఎంపీపీ

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాక వరపాలెం మండలం భీమ బోయినపాలెంలో రూ.500 కోట్లతో నిర్మించ నున్న మెడికల్ కళాశాల పనులను శుక్రవారం మాకవరపాలెం ఎంపిపి రుత్తల రుత్తల సత్యనారాయణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు రుత్తల శ్రీనువాసరావుపాల్గొన్నారు.

సీలేరు సర్పంచ్ పరదేశి మృతి

విశాలాంధ్ర - సీలేరు: జికెవీధి మండలం సీలేరు సర్పంచ్ కొర్రా పరదేశి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. భద్రాచలం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. దీంతో సీలేరులో విషాదఛాయలు అలుముకున్నాయి.

29న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

విశాలాంధ్ర - రావికమతం: మండలంలో గల కొత్తకోట బ్రాహ్మణ వీధిలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణం అతి వైభవంగా ఈనెల 29వ తేదీ మంగళవారం నిర్వహించబడుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన నళిని సిల్క్ మేనేజింగ్ పార్టనర్ గుమ్మడి చినబాబు దంపతులచే ఈ కళ్యాణ మహోత్సవం జరుగనుందని అన్నారు. అదే రోజు ఉదయం 5 గంటల నుండి వారికి అభిషేకములు, 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఊరేగింపు కార్యక్రమం అతి వైభవంగా జరుపబడునని నిర్వాహకులు తెలిపారు.

ఉన్నత విద్యను అందించాలి

విశాలాంధ్ర - చీడికాడ: విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉన్నతమైన విద్యను అందించాలని ఎంఈఓ గంగరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతుల దేవరపల్లి, చీడికాడ పాఠశాలల తెలుగు ఆంగ్ల ఉపాధ్యాయులకు శుక్రవారం వృత్తంతర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోర్స్ కోఆర్డినేటర్ గాలి అప్పారావు, రిసోర్స్ పర్సన్‌లు కె.గోవిందరావు, ఉపాధ్యాయులు మల్లీశ్వరి, సిబ్బంది కే గోవింద్, వి నాగేశ్వరావు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ధైర్యం అవసరం

విశాలాంధ్ర - మల్కాపురం: మహిళలు తమను తాము రక్షించుకోవడానికి ముందు ధైర్యంగా ఉండాలని, అవసరమైనప్పుడు పోలీ సులను ఆశ్రయించాలని 'దిశ' పోలీస్ స్టేషన్ సబ్ ఇనస్పెక్టర్ కె.నీలిమ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల 'లైంగిక వేధింపుల వ్యతిరేక కమిటీ' ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి మహిళ రక్షణకు, భద్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు. కుటుంబంలో గానీ, పనిచేసే ప్రదేశంలో గానీ, విద్యాలయాల్లో గాని లైంగిక వేధింపులకు గురైతే, వారు తగిన రీతిన స్పందించాలని అన్నారు. అందుకుగాను ఆత్మరక్షణ విద్యలను కళాశాలలో ప్రవేశపెట్టాలని అన్నారు. నెలకు ఒకసారైనా లైంగిక వేధింపుల నిరోధానికి సంబంధించి సమావేశాన్ని ఏర్పరచుకోవాలని, మహిళలు తమ అనుభవాలను సమస్యలను చర్చించుకోవాలని ఆమె అన్నారు. సదస్సుకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అధ్యక్షత వహించారు. సమావేశంలో కమిటీ కన్వీనర్ ఎ.రోజా, కో-ఆర్డినేటర్లు వై.అనసూయా దేవి, కె.ఉమామహేశ్వరి మరియు అధ్యాపకులు, మహిళా పోలీసులైన ఉమ, మహేశ్వరి, అనురాధ పెద్ద సంఖ్యలో విద్యార్థినిలు పాల్గొన్నారు. అనంతరం కె. నీలిమను ఘనంగా సత్కరించారు.

మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాలి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో లింగ వివక్షతను ఆడపిల్లలపై అత్యాచారాలను, లైంగిక వేధింపులను అరికట్టాలంటూ వెలుగు సీసీల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బాలికల ఆశ్రమం పాఠశాల నుండి పోలీస్ స్టేషన్ కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన దారుణ చర్యలను ముక్త కంఠంతో ప్రతి ఒక్కరు ఖండించాలని మహిళలపై హింసలను, ఆడపిల్లల అత్యాచారాలను బాలికల అక్రమ రవాణాను ముగింపు పలకాలని నినాదాలు చేశారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల రక్షణ కరువైందని అన్నారు. దిశా చట్టాలు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఉన్నప్పటికీ బాలికలపైన, మహిళలపైన అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్ కుమార్, సిడిపిఓ ఎస్.రాజేశ్వరి, వైసీపీ అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్‌రావు, ఎంపిటిసిలు బి.కమల, సిహెచ్ కొండమ్మ, మాజీ జెడ్పిటిసి కె.కాసులమ్మ, జయదేవ్, వెలుగు సీసీలు జగదాంబ, నీలకంఠం, బాబురావు, నాగరాజు, వెలుగు మహిళా సమైక్య సభ్యులు ఆర్.సుమిత్ర, ఎస్.జోగమ్మ, ఎస్.పుణ్యవతి, వ్యాయామ ఉపాధ్యాయురాలు అశోక్ కుమారి పాల్గొన్నారు.

ఏయూ మైదానంలో ఉజ్జీవ సభలు



విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో కల్వరి మినిస్ట్రీస్ బెల్లంపల్లి వారి ఆధ్వర్యంలో ఉజ్జీవ సభలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ మాట్లాడుతూ ప్రవీణ్ కుమార్ రెండు తెలుగు రాష్ట్రాలలో చేస్తున్న క్రైస్తవ సేవను గూర్చి వివరించారు. వ్యవస్థాపకులు మంచివారైతేనే ఏ వ్యవస్థ అయినా ప్రజలలో బలంగా ముందుకు వెళుతుందని అప్పుడే ఆ వ్యవస్థ యొక్క ఆశయాలు సిద్ధాంతాలు ప్రజల్లోకి వెళ్తాయన్నారు. ప్రజలందరూ బాగుండాలని నవరత్నాలుగా సంక్షేమ పథకాలను ఆంధ్రప్రదేశ్లో ఇవ్వడం జరుగుతుందని, ఇలాంటి పథకాలు భారతదేశంలో మరి ఎక్కడ లేవనీ, క్రైస్తవులందరూ జగన్మోహన్ రెడ్డిని రాబోయే రోజుల్లో మరల గెలిపించవలసిన అవసరం వుందన్నారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు, కల్వరి మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు ప్రవీణ్ కుమార్, సిస్టర్ షారోన్, ప్రీతం లుక్, హనీ జాన్సన్, విశాఖపట్నంలోని క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర - చీడికాడ: కోసిన వరిచేను పట్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ఏఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కోసి ఉంచిన వరిచేను తడిస్తే గింజ మొలకెత్తకుండా రంగు మారకుండా ఉండుటకు ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేయాలన్నారు. పొలంలో ఎక్కువఉన్న నీటిని కాలువల ద్వారా బయటకు పంపాలన్నారు.

గీతంలో ఫార్మశీ వారోత్సవాల ముగింపు

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ఆధ్వర్యంలో గత ఆరు రోజులుగా జరుగుతున్న ఫార్మశీ వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ పి.రామారావు మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో ఫార్మశి నిపుణుల పాత్ర కాలానుగుణంగా మారుతోందన్నారు. ఫార్మశీ వారోత్సవాల భాగంగా వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

శివకేశవుల ఆలయంలో ప్రవచనాలు

విశాలాంధ్ర - రావికమతం: అత్యంత ప్రసిద్ధి చెందిన కొత్తకోట శివకేశవులు ఆలయంలో వచ్చే నెల 25వ తేదీ వరకు గుమ్మడి రామారావు గారిచే రామాయణం మహాభారతం భాగవతం తెలియజేసే ప్రవచనాలు కార్యక్రమం ప్రారంభించారు. ప్రతీ రోజు సాయంత్రం 6గంటలు నుంచి 7-30 గంటల వరకు ఈ ప్రవచనాలు తెలియజేస్తారు. గ్రామ పెద్దలు, కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు గుమ్ముడు సత్యదేవ, సర్పంచ్ కోన లోవరాజు, పందల దేవా, శీలం శంకర్రావు, గుమ్మడి దొరబాబుతో పాటు పలువురు రామారావుని శాలువతో సత్కరించి పూలమాలలు వేసి గౌరవించారు. కార్యక్రమంలో కేదార్శెట్టి గున్నజి, పెనుగొండ నానాజీ, గాలి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.



నగరంలో ఆరుగురు సీఐలకు బదిలీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆరుగురు సీఐలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసారు. ఈస్ట్ ట్రాఫిక్ విభాగానికి అటాచ్ చేయబడిన బి.తిరుమలరావును టూ టౌన్ లా అండ్ ఆర్డర్‌కు, అక్కడ పనిచేస్తున్న కె.వెంకట్రావును స్పెషల్ బ్రాంచ్ - 1కు బదిలీ చేశారు. అలాగే ఎస్బి-1లో ఉన్న హెచ్.మల్లేశ్వరావును వీఆర్‌కు బదిలీ చేసి ఎంవిపి పీఎస్ లా అండ్ ఆర్డర్‌కు అటాచ్ చేసారు. అక్కడ ఉన్న కె .ఎన్.ఎస్.వి.ప్రసాద్‌ను ద్వారక ట్రాఫిక్ విభాగానికి, అక్కడ ఉన్న సిహెచ్ షణ్ముఖరావును వీఆర్‌కు బదిలీ చేసి ఈస్ట్ ట్రాఫిక్ - 2 కు అటాచ్ చేసారు. అక్కడ ఉన్న ఎ.వి.లీలారావును వీఆర్ బదిలీ చేసారు.

ట్రైనీ ఐపీఎస్‌లకు కోస్టల్ సెక్యూరిటీపై అవగాహన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరానికి విచ్చేసిన 24 మంది ట్రైనీ ఐపీఎస్‌లకు మాడ్యూల్ శిక్షణలో భాగంగా కోస్టల్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం నగర కాన్ఫరెన్స్ హాల్‌లో నగర కమిషనర్ సి.హెచ్ శ్రీకాంత్ ట్రైనింగ్ ఐపీఎస్ ల సందేహలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ, నగర డి.సి.పి సుమిత్ సునీల్ గరుడ్, కోస్టల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు విశాఖ పోర్టు ట్రస్ట్‌లో కూడా ట్రైనీ ఐపీఎస్ అధికారులకు పోర్టు చైర్మెన్ కె రామ్మోహన్ రావు పోర్టు భద్రత వ్యవహారాలపై తెలియజేశారు.

పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - హుకుంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన నాడు-నేడు కార్యక్రమం ద్వారా నూతన భవనం మంజూరైందని స్థానిక సర్పంచ్ పాటి లక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్ర పరిధిలో గల పాతకోట పంచాయతీ ఎగరూడి గ్రామంలో రూ.35 లక్షల వ్యయంతో నూతనంగా పాఠశాల భవన నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. భవనం లేక రేకుల షెడ్డులోనే విద్యనభ్యసించేవారని ఇప్పుడు ఈ నిర్మాణం పూర్తయితే ఉపయోగంగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి.అభి, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటరావు, వైస్ సర్పంచ్ బాలన్న, వైసీపీ నాయకులు చిన్నయ్య, వార్డు మెంబర్ బొంజుబాబు, వలంటరీ అనిల్, రాంబాబు, గ్రామస్తులు భాస్కర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

జెండాకొండలో సినిమా హీరో సుహాస్ సందడి

విశాలాంధ్ర - హుకుంపేట: ఉత్తరాంధ్రాలో అత్యంత ఎత్తైన, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న సీతమ్మపర్వతం (జెండాకొండ)లో శుక్రవారం 'కలరొటో సినిమా హీరో సుహాస్ తన స్నేహితులతో కలిసి సందడి చేశారు. మండలంలోని తీగలవలస పంచాయతీ ఓలుబెడ్డా గ్రామం మీదుగా శుక్రవారం సాయంత్రి ఆయన తన స్నేహితులతో కలిసి జెండాకొండలో రాత్రి బసచేశారు. శనివారం ఉదయం కొండలో కనువిందు చేస్తున్న అద్భుత ప్రదేశాలు సముద్రంలా తలపించే మంచు అందాలు, అందమైన మేఘాలు, సూర్యోదయం ప్రకృతి రమణీయతను ఆస్వాదించారు. వాటితో పాటు కొండ ప్రాంతంలో ఉన్న దింసా రాళ్ళు, తేనేపట్టు గుహలు, కొండ దిగువనున్న హుండి జలపాతం, గుడ్డిగుమ్మి జలపాతం, గొడుగురాయి జలపాతాలను చూసి ఫిధా అయ్యారు. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ జెండాకొండ అందాలు చాలా అద్భుతంగా ఉందని, ఈ ప్రదేశంలో కొద్దిరోజుల్లోనే సినిమా షూటింగ్లు నిర్వహిస్తామని అన్నారు. ఏజేన్సీలో ఎక్కడలేని అద్భుతమైన అందాలు జెండాకొండలో మాత్రమే ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.



వచ్చే నెలలో సీఎం జగన్ రాక : ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

విశాలాంధ్ర - నర్సీపట్నం : వచ్చే నెలలో మాకవరపాలెం మండలంలో రూ.500 కోట్లతో నిర్మాణం చేయనున్న మెడికల్ కాలేజ్ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారని, అదే రోజు రూ.470 కోట్లతో ఏలేరు నుంచి తాండవ ప్రాజెక్ట్ లిఫ్ట్ ఇరిగేషన్ సంబంధించిన పనులు శంకుస్థాపన చేయనున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. గురువారం ముఖ్యమంత్రిని విజయవాడలో కలవడం జరిగిందని, ఈ సందర్భంగా నర్సీపట్నం నియోజకవర్గ సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి గురించి, దీర్ఘకాలిక సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు. డిసెంబరు నెల రెండు లేదా మూడో వారంలో సీఎం మాకవరపాలెం మండలం వస్తారన్నారు. ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నర్సీపట్నంనియోజకవర్గంలో 34 సచివాలయాల్లో సుమారు 61 పంచాయతీల్లో చేపట్టడం జరిగిందన్నారు. ప్రతీ ఇంట సుమారు 3లక్షల నుంచి 4లక్షల వరకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 34 సచివాలయంలో సుమారు 20లక్షలతో పాటు 6 కోట్ల 80 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి టెండర్లు పూర్తయ్యాయన్నారు. త్వరలో ఈ పనులు ప్రారంభ మౌతాయన్నారు. మూడు రాజధానులకు మద్దతుగా బైక్ ర్యాలీ పెట్టినప్పుడు గొలుగొండ మండలంలో తనకు బైక్ ప్రమాదం జరిగి సుమారు 50 రోజుల వరకు బెడ్ మీద ఉండాల్సి వచ్చిందన్నారు. అయితే ప్రస్తుతం నించోడానికి మాత్రమే అవకాశం ఉందని, నడవడానికి వీలు లేదని డాక్టర్లు చెప్పారన్నారు. దీంతో డాక్టర్ల సూచన మేరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వీల్‌చైర్ సహాయంతోనే చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ నెల 28 నుంచి నాతవరం మండలం శృంగవరం నుంచి మళ్లీ ఈ ప్రారంభిస్తామన్నారు. దీనికి పార్టీ నాయ కులు, అధికారులు, ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే వచ్చే నెలలో సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు, అధికారులు సిద్ధం కావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి : జీవీఎంసీ కమిషనర్ రాబాబాబు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఏపీ ఫెడరేషన్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోషియేషన్ వారితో జీవిఎంసి కమిషనర్ పి.రాజాబాబు వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో వెల్ఫేర్ అసోషియేషన్ వారి వారి ప్రాంతాలలో ఉన్న రోడ్లు, డ్రెయిన్లు, ఆక్రమణలు, వీధి దీపాలు, పందులు మొదలగు వాటి వలన కోలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. పార్కులలో ఆహ్లాదమైన వాతావరణం, పచ్చదనం లేకుండా పోతుందని పై వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అసోషియేషన్ వారు తెలిపిన విషయాలపై తగు చర్యలు అంచలంచెలుగా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తదుపరి కమిషనర్ మాట్లాడుతూ నేను కమిషనర్ పోస్టుకి కొత్త అయినా విశాఖ సిటీకి పాత వాడినే, సిటీలో ప్రతి ప్రాంతము నాకు బాగా తెలుసు. ఏ సమస్యలు ఉన్నా పరిష్కరిస్తాను. విశాఖపట్నాన్ని మోస్ట్ లివింగ్ సిటీగా తయారుచేయాలనే ఉద్దేశ్యము నాకు ఉన్నది. కనుక మీ అందరి సహాయ సహకారాలు కావలి, జీవిఎంసి లోని అన్ని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోషియేషన్లు కలిసి కట్టుగా పనిచేసిన యెడల మన నగరం ఒక అందమైన సుందర నగరంగా తీర్చిదిద్ది రాబోయే తరాలవారికి అందిద్దాం. ప్రజలందరికి మంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తూ దేశంలోనే మంచి బెస్ట్ లివింగ్ సిటీగా తీర్చిదిద్దుదాం. అదే విధంగా యూజర్ చార్జీలు, ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఖాళీ స్థల పన్నులు, ట్రేడ్ లైసెన్సు ఫీజులు మొదలగు చెల్లింపులపై రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోషియేషన్లు వారు ప్రజలకు అవగాహన కల్పించి నగరాభివృద్ధికి ఆదాయం పెంచేందుకు సహకరించాలని కోరారు. మీ మీ ప్రాంతాలలో ఎటువంటి సమస్యలు ఉన్న యెడలా నా దృష్టికి గాని, జోనల్ కమిషనర్ల దృష్టికి గాని తీసుకొని వెళ్ళిన యెడల వాటిని వెంటనే పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి ఫెడరేషన్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులైన ఉదయశ్రీమాని, కెఎస్ఆర్ మూర్తి, దుర్గా ప్రసాద్, కోటేశ్వర రావు, డాక్టర్ రామారావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్జి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నటశేఖర్ కృష్ణకు ఘన నివాళులు

విశాలాంధ్ర - రావికమతం : ఇటీవల మరణించిన సూపర్‌స్టార్, నటశేఖర్ కృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి స్థానిక పంచాయతీ పాలక వర్గ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం కొత్తకోట మెయిన్ రోడ్డు హనుమాన్ ఆలయ సమీపాన, సుదీర్ఘకాలంగా జూనియర్ కృష్ణగా సుపరి చితు డైన మల్లిసాంబమూర్తి ఈ ప్రాంతంలో అనేక రికార్డింగ్ డాన్సర్‌లో పాల్గొని పలువురిని ఆకట్టు కున్నారు. ఆయన ఆధ్వర్యంలో కృష్ణ చిత్రపటానికి పూల మాలలు వేశారు. అనంతరం కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ కోన లోవరాజు ఉపసర్పంచ్ పి.దేవా మండల వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి శీలం శంకరరావు శివాలయం పాలకమండలి చైర్మన్ గుమ్మడి దొరబాబు, పెనుగొండ నానాజీ, బేత పాండు, మల్లి చిరంజీవి, కృష్ణ అభిమాన సంఘాల పెద్దలు పాల్గొని చలనచిత్ర రంగానికి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కృష్ణ కుటుంబానికి భగవంతుడు అన్ని విధాల మనోధైర్యం ఇవ్వాలని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్ష తెలియజేశారు.

ముమ్మరంగా పారశుద్ధ్య పనులు

విశాలాంధ్ర - మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతం పరిధిలోని 61 వ వార్డు మల్కాపురం మరిడిమాంబ ఆలయానికి అను కొని ఉన్న ప్రధాన కల్వర్టు లోని పూడికలు శుక్రవారం జీవీఎంసీ సిబ్బంది చేపట్టారు. అయితే గత కొన్ని ఏళ్లుగా పూడికల తొలగించకపోవడంతో వర్షం పడితే కల్వర్టు లోని వ్యర్థనీరు సమీప మున్న ఇళ్లలోకి చేరి చాలా ఇబ్బందులు ఎదుర్కొండేవారు. పూడికలు తొలగింపుపై ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్న ప్పటికీ తొలగించిన వర్గాలు రహదారి పైనే వెయ్యడం వలన ఇటువైపుగా ప్రయాణాలు సాగించేవారు. మరల ఈ చెత్తను ఎప్పుడు తొలగిస్తారు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే త్వరగా తిన రహదారి పైన చెత్తను కూడా తొలగిస్తే బాగుంటుందని పేర్కొంటున్నారు.

యలమంచిలి శివార్లలో మంచు దుప్పటి

విశాలాంధ్ర - యలమంచిలి : సూర్యోదయ వేళ మేఘం విరిగిపడినట్లు కురిసిన మంచుపొగలు శుక్రవారం ఉదయం నుంచి ఆకాశం మేఘా వృతం కావడంతో సాయంత్రం చీకటి పడేవరకు యల మంచిలి శివారు ప్రాంతమంతా మంచు పల్లకిలో ఉన్నట్లు మాన్యాన్ని తలపించింది.ప్రధాన రహదారిపై మంచు కమ్ము కోవడంతో రోడ్లు కూడా కనపడక వాహనాలు లైట్లు వేసుకుని వెళ్లాయి. మొత్తానికి మంచు అందాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేశాయి.

కబడ్డీ పోటీల్లో నర్సీపట్నం జట్టుకు ద్వితీయ స్థానం

విశాలాంధ్ర - నర్సీపట్నం : జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా అనకాపల్లిలో జరిగిన కబడ్డీ పురుషుల పోటీల్లో నర్సీపట్నం కబడ్డీ టీమ్ ద్వితీయ స్థానం సాధించింది. మొదటి మ్యాచ్ పాయక రావుపేటతో నర్సీపట్నం 20/47, రెండవ మ్యాచ్ అనకాపల్లి, నర్సీపట్నం 12/42, ఫైనల్ మ్యాచ్‌లో యలమంచిలి, నర్సీపట్నం 22/19 3 పాయింట్ల తేడాతో నర్సీపట్నం టీమ్ రెండవ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ద్వితీయ స్థానం పొందిన క్రీడాకారులు మాట్లాడుతూ కబడ్డీ పోటీలు చాలా ఆసక్తికరంగా కొత్త టెక్నికల్ స్కిల్స్‌తో నాక్ ఔట్ గేమ్ కష్టంగా పోరాడామని, తర్వాత జరుగు టోర్నమెంట్‌కి ఈ సారి మొదటి స్థానం సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాప్ కోచ్ అబ్బు, కబడ్డీ కోచ్ మజ్జి సాయి వెంకటహరినాథ్ పాల్గొన్నారు.

ప్రేమ సమాజంలో నిత్యావసర వస్తువులు పంపిణీ

విశాలాంధ్ర - కశింకోట : మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు జన్మదిన వార్షికోత్సవంలో భాగంగా, గంటా యువసేన కన్వీనర్లు, జెర్రిపోతులు నూక నాయుడు, గొంతుని గంగాధర్ ఆధ్వర్యంలో, ఎలమంచిలి మండలం కొక్కరాపల్లి ప్రేమ సమాజంలో, నెల రోజులకు సరిపడా నిత్యవసర వస్తువులు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి చేతుల మీదుగా అందజేశారు ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ, గంటా శ్రీనివాసరావు జన్మదిన వార్షికోత్సవాలు భాగంగా కశింకోట మండలంలో గంటా యువసేన ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా వారం రోజులపాటు జరగటం దేశం లో ఏ నాయకునికి లేదని అది ఒక్క గంటా శ్రీనివాసరావుకి జరగడం గొప్ప విషయం.అని తెలియజేశారు. ఒక నాయకునికి పై అభిమానం తెలియజేయటంలో ఇంత కంటే ఏముంటుంది అని సభముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కలగా సోమేశ్వరరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు సిద్దిరెడ్డి సూర్యనారాయణ, తాళ్లపాలెం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉల్లింగల రమేష్,, గుమ్మాల మాణిక్యం, బుదిరెడ్డి రామారావు, సింహాద్రి దేవా,రాజు, అప్పారావు, మరియు తెలుగుదేశ కార్యకర్తలు, నాయకులు గం టా అభిమానులు పాల్గొన్నారు.

తాండవ జలాశయంలో బోటు షికారు నిషేధం

విశాలాంధ్ర - నాతవరం : తాండవ జలాశయంలో బోటు షికారును నిషేదించామని తాండవ డీఈ ఎం.రాజేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండవ ప్రాజెక్టులో నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మత్స్య కారులు అనధికారికంగా ప్రాజెక్టులో బోట్లు తిప్పి చర్యలు తీసుకుంటామన్నారు. నాతవరం, గొలుగొండ, కొయ్యూరు పరిధిలో ఉన్న 14 గ్రామాల్లోని మత్స్యకారులకు దండోరా ద్వారా ఈ విషయం తెలియజేశామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తాండవ ప్రాజెక్టులో మత్స్యశాఖ నుంచి లైసెన్సులు కలిగి ఉన్న మత్స్యకారులు మాత్రమే బోట్లపై వెళ్లి చేపలు వేటాడుకోవాలన్నారు. కొంత మంది ఎలాంటి అనుమతులు లేకుండా సందర్శకులను బోట్లపై తాండవ ప్రాజెక్టులో తిప్పుతున్నారన్నారు. అలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని ప్రమాదాలకు తావు లేకుండా బోటు షికారును నిషేధించడం జరిగిందన్నారు. ఈ విషయంపై నాతవరం పోలీసులకు సమాచారం ఇచ్చామని, నిబంధనలు ఉల్లంఘించి బోట్లపై సందర్శకులను తిప్పుతూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తారన్నారు.

అయ్యప్ప స్వామిలకు అన్నదానం

విశాలాంధ్ర - ఆనందపురం : పంచాయతీ పొడుగు పాలెం దొంతల వారి కల్లాలు అయ్యప్ప పీఠం స్వామీలకు భక్తులకు శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైయస్సార్సీపి మండల యూత్ అధ్యక్షుడు చందక అప్పల స్వామి 12 వేల రూపాయలు ఆర్థిక సాయంతో ప్రసాదం, పీఠంలోని 60 మంది స్వామీలకు 40 రోజులు పాటు మధ్యాహ్నం బిక్షలో సుమారు 24 వేల రూపాయలు బియ్యాన్ని అందించారు. ఆనందపురం, 2 ఎంపీటీసీ బంటుబిల్లి అప్పలస్వామి 6 వేలు ఆర్థిక సాయంతో 60 మంది స్వామీలు ఒక్కొక్కరికి పది ప్యాకెట్లు చొప్పున టాటా గ్లూకోజ్ ను అందజేశారు. పీఠంలోని స్వామీలు ఆర్థిక సాయంతో సుమారు 2500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల యూత్ అధ్యక్షులు చందక అప్పల స్వామి (స్వామి), కర్రోతు సత్యనారాయణ, షిణగం రామారావు, చందక శంకర్రావు, దొంతల శ్రీను, దొంతల బంగార్రాజు, వెంకట నారాయణ, దొంతల అప్పలనారాయణ, గ్రామంలోని యువకులు స్వామీలు పాల్గొన్నారు.

దంత వైద్యులకు గీతంలో ఎండో డాంటిక్‌పై వర్క్‌షాప్

విశాలాంధ్ర - మధురవాడ : దంత వైద్యంలో కీలకమైన చికిత్స విధానంగా పేర్కొనే ఎండో డాంటిక్‌పై గీతం దంత వైద్య కళాశాల మరియు ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం తేది:25-11-2022న దంత వైద్యులకు రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. విశాఖలో త్వరలో జరగనున్న 41వ ఆంధ్ర రాష్ట్ర దంత వైద్యుల సమావేశాలకు ముంద స్తుగా ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు భారత దంత వైద్యుల సంఘం విశాఖ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వర్క్‌షాప్‌లో చెన్నైకి చెందిన ఠాగూర్ దంత వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వందన జేమ్స్ రిసోర్స్ పర్సన్‌గా హాజరై ఎండోడాంటిక్స్‌లో నూతన చికిత్స విధానాలపై ప్రసంగించారు. కార్యక్రమానికి గీతం దంత కళాశాల ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఎస్.రాజు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ డాక్టర్ ఎమ్.జ్యోతి, ఎండో డాంటిక్స్ విభాగం అధిపతి డాక్టర్ కె.సిరీష తదితరులు పాల్గొన్నారు.

అఘాయిత్యాలు, మోసాలపై మహిళలకు అవగాహన

విశాలాంధ్ర - నర్సీపట్నం : ఇంటర్నేషనల్ డే ఫర్ ఎలిమినేన్ ఆఫ్ వయోలెన్స్ ఎగెనెస్ట్ ఉమెన్ సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉమెన్ ఎమ్‌పవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు నర్సీపట్నం బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు మహిళల పట్ల జరిగే అఘాయిత్యాలు, మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో బాలికల యొక్క నడవడిక, సమాజంలో బాలికలు, మహిళలు ఏ విధంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలో దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకురాలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొర్రాయి, కొల్లాపుట్టులో ఆటో స్టాండ్స్ ఏర్పాటు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : మండలంలోని అరకు సంత బయలు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కొర్రాయి, కొల్లాపుట్టు నూతన ఆటో స్టాండ్‌లను స్థానిక ఆ పంచాయతీ సర్పంచ్‌లు పి.కొములు, రామ్మూర్తిలు శుక్రవారం అరకులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆటో వాహరదారులు నడపాలని వారు సూచించారు.రోడ్డు సౌకర్యమున్న ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆ ప్రాంత గిరిజనులకు ఆటోలే ప్రధాన రవాణా సౌకర్యం అవుతుందన్నారు. ఆటో వాహనదారులు బాధ్యతాయుతంగా నడిపి ప్రయాణికులకు సురక్షితంగా గమ్యం చేరే విధంగా ఉండాలని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు ఆ ప్రాంత గిరిజనులు పాల్గొన్నారు.

జంతు సంపదను కాపాడుకోవాలంటూ వినూత్న బోధన

విశాలాంధ్ర - మాకవరపాలెం : అంతరించిపోతున్న జంతు సంపదను కాపాడుకోవాలని మండలంలోని కొత్తపాలెం ప్రధానోపాధ్యాయులు కె.రాము అన్నారు. పాఠశాలలో విద్యా ర్థులకు వినూత్న రీతిలోజంతు మాస్కులతో బోధన చేశారు. దీంతో విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాఠాలు విన్నారు. అంతరించి పోతున్న జంతువులను భవిష్యత్ తరాలకు జూలోనూ, పుస్తకాల్లోనే కనిపిస్తాయన్నారు. విద్యార్థులకు ఈ విషయాలు తెలియజేయాలనే ఈ విధంగా బోధిస్తున్నామన్నారు.

కలిగొట్ల పొలాల్లో కొండచిలువ హలచల్

విశాలాంధ్ర - దేవరాపల్లి : దేవరాపల్లి మండలంలో కలిగొట్ల గ్రామంలో అమ్మచెరువు దగ్గర బండారు వారి కల్లాలు వద్ద పొలంలో కొండచిలువ కలకలం రేపింది స్థానిక రైతులు అమ్మచెరువు ఒడ్డున వున్న గట్టుపై పశువులను, మేకలు మేతకు తోలుకుని వెళ్ళగా అక్కడ అకస్మాత్తుగా రైతులకు మేకలు పరుగును అరుపులతో రావడం చూసిన గొల్లు రవితేజ, వనుం రవి, వనుం ఈశ్వరరావు, సిమ్మన్న అటుగా వెళ్లి చూడాగా సుమారు పది అడుగుల కొండ చిలువ ఉండటంతో ఒక్కసారిగా బ్రయబ్రాంతులు కాగా చుట్టు పక్కల ఉన్నవారు సహాయంతో కర్రతో శబ్దం చెయ్యడంతో చెరువు వైపు పోయింది.

సాంప్రదాయ కలలను ప్రోత్సహిద్దాం : నందవరపు సోములు

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ కళా సేవా పీఠం వార్షికోత్సవము పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు చే నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించరి .వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అబ్బురు పరచాయి. శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి, ముఖ్యంగా జానపద నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని ఉద్దేశించి అధ్యక్షులు ఎన్.సోములు మాట్లాడుతూ సాంప్రదాయ కళలైన కూచిపూడి, భరతనాట్యం ,జానపద తదితర నృత్యాలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉందని, కళలు సమాజ అభివృద్ధికి ఎంతో దోహద పడతాయన్నారు.అనంతరం నృత్య పోటీల్లో వివిధ పాఠశాల విద్యార్థులు ప్రతిభను మెచ్చుకొని వారికి మెమొంటోస్, బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు కళా పీఠం సభ్యులు అందజేసరి. ఈ కార్యక్రమంలో సభ్యులు అందరూ పాల్గొన్నారు.

27 నుంచి సుబ్రహ్మణేశ్వరస్వామి షష్టి మహోత్సవాలు

విశాలాంధ్ర - నర్సీపట్నం : నర్సీపట్నం శారదానగర్ బైపాస్ రోడ్డు గల శ్రీశ్రీశ్రీ వల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవాలు జరగనున్నాయని ఆలయ కమిటీ తెలిపింది. ఈ నెల 27న ఉదయం 10 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యా వచనం, శ్రీసుబ్రహ్మణ్య స్వామికి 60 లీటర్లతో క్షరాభిషేకం, సాయంత్రం నాలుగు గంటలకు రాహు కేతు పూజలు, 28న ఉదయం సుబ్రహ్మణ్యస్వామికి విభూతి అభిషేకం, 10 గంటలకు శ్రీసుబ్రహ్మణ్య స్వామి వారి హోమం, సాయంత్రం 6 గంటలకు సుబ్రమణ్య స్వామి వారి కళ్యాణం జరుగుతుందన్నారు. 29 ఉదయం నాలుగు గంటల నుండి సుబ్రహ్మణ్యస్వామి షష్టి సందర్భంగా అభిషేకాలు అర్చనలు జరుగుతాయన్నారు. 29 మంగళవారం సుబ్రహ్మణ్య స్వామి షష్టి సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నదాన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. పూజలు జరిపించుకునే భక్తులు ఆలయ కమిటీ పూజారి శేఖర్ స్వామి, మణికంఠ స్వామిని 9490036207, 9440843532, 9030351845, 8374474114 సంప్రదించాలని కోరారు.

ప్రతి బుధవారం టౌన్‌ప్లానింగ్ పై 'స్పందన'

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ప్రతి బుధవారం టౌన్ ప్లానింగ్ విభాగంపై ప్రత్యేకంగా "స్పందన" కార్యక్రమం నిర్వహించబడుతున్నదని జీవిఎంసి కమిషనర్ పి రాజా బాబు నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "స్పందన" కార్యక్రమంలో పట్టణ ప్రణాళికా విభాగంపై అధికంగా ఫిర్యాదులు వస్తున్న దృష్ట్యా ఇక పై ప్రతి బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు జీవిఎంసి సమావేశ మందిరంలో పట్టణ ప్రణాళికా విభాగం పై ప్రత్యేకంగా "స్పందన" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ప్రజలకు తెలియజేశారు.

ప్రజల సమస్యలు గుర్తించేందుకే 'గడపగడపకు మనప్రభుత్వం'

ఎమ్మెల్యే ముత్తంశెట్టి

విశాలాంధ్ర - పీఎం పాలెం : 8వ వార్డు పరిధిలో గల సాగర్ నగర్ 2 సచివాలయంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న భీమిలి నియోజకవర్గం శాసన సభ్యులు ముత్తం శెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. సంక్షేమ పథకాలు అమలు రివ్యూ లో బాగంగా గడప గడప కు 680 ఇళ్ళు తిరిగి జగనన్న 3 ఏళ్ల పరిపాలనా కాలంలో గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలు అడిగి తెలుసుకోవడం జరిగిందని, అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ పథకాలు అందాయని సంతోషంతో చెప్పడం జరిగిందన్నారు. వార్డు లో ఇంకా సమస్యలు ఏమైనా ఉన్నాయా అని స్థానికులును అవంతి అడుగగా, సాగర్ నగర్ 2 - LIG - AB బ్లాక్‌లో - MIG - CD బ్లాక్ లో అవంతి గారి దృష్టిలో పెట్టిన దీర్ఘకాలిక సమస్యలు తెలియజేశారు. సాగర్ నగర్ పరిదిలో గల గ్రంథాలయం దగ్గర ఉన్న కమ్యూనిటీ హాలు మరమ్మతులు చేపట్టాలని, అవంతి కమ్యూనిటీ భవనం మరమ్మతులు చేపట్టాలని, వార్డు లో అన్ని ప్రాంతాలు డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణం చేసి చాలా ఏళ్ళు కావడం వలన పాడైపోవడం జరిగింది వాటిని సంపూర్ణంగా మరమ్మతులు చేపట్టాలని, సాగర్ నగర్ కి వచ్చే ఆర్టీసి బస్సు లు సమయాలు పెంచాలని స్థానిక ప్రజలు కోరగా అవంతి శ్రీనివాసరావు ఆర్టీసి రీజినల్ మేనేజర్ తో మాట్లాడి సమస్య పరిష్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ లు వార్డు ఇంచార్జ్ లుఆయా పదవుల్లో ఉన్న వారు మండలం ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచకర్లకు అభినందనల వెల్లువ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : విశాఖపట్నం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షులు గా నియమితులైన పంచకర్ల రమేష్ బాబు ను రెండవ రోజు కూడా సీతమ్మధారలో శుక్రవారం ఆయన నివాసం లో కలిసి పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి, మాజీ మంత్రి బాలరాజు, బి.సి కమిషన్ సభ్యులు పక్కి.దివాకర్, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవిరెడి, సతీష్ వర్మ, స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకులు మంత్రి రాజశేఖర్, పార్టీ యస్‌సి విభాగం రాష్ట్ర నాయకులు ప్రేమ్ బాబు, నాయకులు రెయ్యి వెంకటరమణ, ద్రోణంరాజు శ్రీవాత్సవ, వుడా రవి, దాడి సత్యనారాయణ, యువశ్రీ, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

నేరేడు ఆకుల్లో ఔషధ గుణాలపై ఏయూ ఫార్మశీ విద్యార్థుల అధ్యయనం

విశాలాంధ్ర - విశాఖసిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మశీ కళాశాల బి.ఫార్మశీ నాల్గవ సంవత్సరం విద్యార్థులు సమాజ ఉపయుక్తంగా ప్రాజెక్టును నిర్వహించారు. తమ ఏడవ సెమిస్టర్‌లో ప్రాక్టీస్ స్కూల్‌లో భాగంగా ఒక ప్రత్యేక అంశంపై ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు శాస్త్రీయ అధ్యయనం చేసి ఫలితాలను విశ్లేషించడం జరుగుతుంది. సమాజ ఉపయుక్తంగా తమ అధ్యయనం ఉండాలనే ఉద్దేశంతో విభాగ ఆచార్యులు, పాలక మండలి సభ్యులు డాక్టర్ ఏ.కృష్ణ మంజరి పవార్ పర్యవేక్షణలో విభాగానికి చెందిన ఆరుగురు విద్యార్థులు నేరేడు ఆకుల్లో ఔషధ గుణాలపై అధ్యయనం జరిపారు. తమ పరిశోధనలో భాగంగా రెండు రకాల ఫ్లావనాయిడ్స్ ఉంటాయని గుర్తించారు. దాదాపుగా 50 గ్రాముల నేరుడు ఆకుల పొడిలో కొర్సిటిన్ 0.342 మైక్రో గ్రాములు, రూటిన్ 1.397 మైక్రో గ్రాములు ఉండటం గమనించారు. ఈ రెండు ఫ్లావనాయిడ్స్ డయాబెటిక్, కాన్సర్ నియంత్రణలో ఉపకరిస్తాయి. విభాగంలో ఉన్న హై పెరఫార్మెన్స్ థిన్ లేయర్ క్రొమెటోగ్రఫీ ఎక్విప్‌మెంట్ (హెచ్‌పిటిఎల్‌సి) పరికరం ఉపయోగించి విశ్లేషణ చేసారు. ఈ అధ్యయనంలో పాల్గొన్న విభాగ విద్యార్థులు నందిని, శ్రీదేవి, అనూష, కళ్యాణ్ రాజ్, సుశిత శ్రీ,శిరీషలను అభినందించారు. సమాజ ఉపయుక్త అంశాలపై అధ్యయనం చేయడం పట్ల విద్యార్థులను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు.

సహజ వనరులు వినియోగిస్తే అధిక దిగుబడులు

విశాలాంధ్ర - కె. కోటపాడు : పొలం బడి వల్ల తక్కువ ఖర్చుతో సహజ వనరులను ఉపయోగిస్తూ ఎప్పటికప్పుడు పొలం పరిసరాల విశ్లేషణను పాటిస్తూ చీడపీడలను నిర్మూలించుకుంటూ నాణ్యమైన అధిక దిగుబడులను పొందవచ్చని జిల్లా వ్యవ సాయ అధికారిణి లీలావతి రైతులకు వివరించారు. పొలంబడి క్లస్టర్ లెవెల్ శిక్షణలో భాగంగా ఏ. కోడూరు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. రైతుల కోసం అమలు చేస్తున్న ఈ క్రాప్, రైతు భరోసా, ధాన్యం కొనుగోలు వంటి కార్య క్రమాలను ప్రతి గ్రామములో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులను సంప్రదిస్తూ అర్హులందరూ లబ్ధి పొందాలని సూ చించారు. ఈ పంట నమోదు చేసుకున్న రైతు లందరికీ వారు పంట నమోదు చేయించుకున్న వివరాలను ఫిజికల్ ఎక్నాలెజిమెంట్ అనగ పంట వివరాలను, గుర్తింపు పత్రాలు, రైతు భరోసా కేంద్రాల నుంచి పొందవచ్చని రైతులకు చెప్పారు. అలాగే ఒక గుర్తింపు పత్రాన్ని రైతులకు అందజేశారు. పొలంబడి చేయు పద్ధతులను ఆచరించవలసిన నియమాలను చీడ పీడలను సకాలంలో నిర్మూలించు పద్ధతులను అలాగే రెండవ పంటగా మొక్కజొన్న వేసుకు న్నట్లయితే కలుగు లాభాలను జిల్లా శిక్షణ అధికారి చిరంజీవి మూడు గ్రామాలు రైతులకు వివరించారు. అలాగే జీవన ఎరువుల వాడు విధానము వాటి ఉపయోగాలను ప్రభుత్వం అందిస్తున్న రాయితీని చోడవరం వ్యవసాయ సహాయక సంచాలకులు రవీంద్రనాథ్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం అగ్రికల్చర్ ఆఫీసర్ విజేత అనకాపల్లి జిల్లా వ్యవసాయ అధికారి గాయత్రి, రైతులు, వ్యవసాయ సహాయక సిబ్బంది పాల్గొన్నారు